క్లుప్తంగా

ముగిసిన కల్యాణ మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దక్షిణపు వీధి మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ దేవస్థానంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకం చేశారు. రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి శ్రీపుష్ప శయనోత్సవం (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు కందుకూరి కన్నబాబు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు రంగవల్లుల పోటీలు



రంగవల్లుల పోటీల్లో జీ-20 లోగోను చిత్రించిన విద్యార్థినులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు భారతదేశ జీ-20 ప్రెసిడెన్సీలో జన్ భాగిదరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత మాట్లాడుతూ విద్యార్థుల్లో వివిధ అంశాల్లో నిబిడీకృతమైన నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు మొక్కలు నాటడం, స్వచ్ఛత ప్రచారం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు ఎం.సత్తిబాబు, జి.ప్రేమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారి ఉత్సవ మూర్తితో క్షేత్రంలో ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 1,70,491 వచ్చిందని, 1200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు మల్నీడి బాబి, దండు వెంకట కృష్ణంరాజు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ‘చాటపర్రు’

- నాలుగేళ్లలో రూ.10 కోట్ల పనులు
- జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రు గ్రామం అభివృద్ధి బాట పట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో మొత్తం రూ.10 కోట్లతో చేపట్టిన పనులు గ్రామ స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ జనాభా ఆధారంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూర్బన్ పథకం నిధులు రూ.1.28 కోట్లతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.2 కోట్లు, పంచాయతీ నిధులు రూ.1.50 కోట్లతో సీసీరోడ్లు వేశారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.62.76 లక్షలతో గ్రామంలో ప్రత్యేక పైప్‌లైన్ నిర్మించారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు బిగించారు. మరో రూ.25 లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రూ.22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.18 లక్షలతో పాల కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి లభించింది. రైతులు ధాన్యం భద్రపరుచుకునేందుకు రూ.55 లక్షలతో స్టోరేజ్ గూడౌన్ నిర్మించనున్నారు. రూ.42 లక్షలతో మూడు శ్మశాన వాటికల అభివృద్ధి, రూ.3 లక్షలతో కమ్యూనిటీ మరుగుదొడ్డి కట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఆర్థిక భరోసా

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. సీఎం జగన్ వైఎస్సార్ చేయూత ద్వారా ప్రజలకు రూ.1.31 కోట్ల లబ్ధి చేకూరింది. అమ్మఒడి ద్వారా రూ.2.66 కోట్లు, జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.41.83 లక్షలు విద్యార్థుల తల్లిదండ్రులకు అందాయి. డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.2.1 కోట్లు ఆసరా ద్వారా పొందారు. వీటితో పాటు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు అందుతున్నాయి.

పాఠశాలల అభివృద్ధి

నాడు – నేడు పథకంలో తొలి విడత మండల పరిషత్ పాఠశాల అభివృద్ధికి రూ.56.35 లక్షలు ఖర్చు చేశారు. తాగునీరు, విద్యుత్, ఫ్లోరింగ్, బల్లలు ఏర్పాటు చేశారు. రెండో విడతలో జెడ్పీ పాఠశాలకు రూ.84 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు.



రూర్బన్ నిధులతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్



జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పైప్‌లైన్ పనులు (ఫైల్)



ఫిల్టర్‌బెడ్లకు నీరు వదులుతున్న సర్పంచ్ రఘు (ఫైల్)

గ్రామాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ



చాటపర్రు గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సుమారు రూ.35 లక్షలు మండల పరిషత్ నిధులు కేటాయించాం. వీటితో చంద్రబాబుకాలనీలో గ్రావెల్ రోడ్డు, జగనన్న కాలనీ అప్రోచ్ రోడ్డు అభివృద్ధి చేశాం. ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు చేపట్టాం. తిమ్మారావుగూడెం చెరువు పూడిక చేపట్టి, కల్వర్ట్ నిర్మించాం.

– పెన్మత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

అర్హులందరికీ పథకాలు



గత ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున నిధులు ఎన్నడూ విడుదల కాలేదు. రూ.కోట్లు ఖర్చుచేసి సీసీ రోడ్లు, సచివాలయం, పాఠశాల తరగతి గదులు, ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు పూర్తిచేశాం. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించాం. 111 మంది పేదలకు స్థలాలు అందించి, మెరక చేశాం. ఇప్పుడు ఇళ్లు నిర్మిస్తున్నాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం.

– గుడిపూడి రఘు, సర్పంచ్

ప్రేమాలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అహలే సున్నతుల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమాలయంలోని ఆశ్రయం పొందుతున్న వృద్ధ మాతలకు మంగళవారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో పేదలకు, వృద్ధులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తమ కుటుంబాలను ఉన్నత స్థితికి తీసుకొచ్చిన వృద్ధమాతలు అవసాన దశలో నిరాదరణకు గురికావడం బాధాకరమని, అటువంటి వారికి తమ సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అహలే సున్నతుల్ జమాత్ అధ్యక్షుడు ఎస్‌కే సాబిర్ హుస్సేన్, ఉప కార్యదర్శి ఎండీ గాలబ్ అలీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎగ్బాల్, ఉస్మాన్ దౌలా అబ్బు బాయ్ పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ పాలకవర్గ సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు ఏఎంసీ పాలకవర్గ సమావేశం ఈ నెల 7న ఉదయం 11 గంటలకు చైర్మన్ నెరుసు చిరంజీవులు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కార్యదర్శి కె.మమత తెలిపారు. 2023 తీసుకున్న పలు నిర్ణయాల వల్ల కలిగే లాభనష్టాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారుల సమస్యలతో పాటు చెక్‌పోస్టుల నిర్వహణ, ఆదాయం, అద్దెలు, ఖర్చులు, డిపాజిట్లపై చర్చిస్తామన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నూర్జహాన్, శ్రీలక్ష్మి



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ నూర్జహాన్



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు పర్యటనకు ఏలూరు జిల్లాకు వచ్చారు. సీఎం జగన్‌ను ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశార. పుష్పగుచ్ఛాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు సీఎం జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు పర్యటనలో ఎమ్మెల్యే నాని సీఎం జగన్ వెంట ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): మానవ మనుగడ, అభివృద్ధి పర్యావరణంతో ముడిపడి ఉందని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పవరుపేట వాసు ఆలయం ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలవికాస్ భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని, ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యుడు వీజీఎం కృష్ణారావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్ కస్తూరిరావు, బాలవికాస్ భారతి సంస్థ అధ్యక్షుడు కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మానవునిపై ఉందన్నారు. పవరుపేట రైల్వే స్టేషన్ రోడ్డులో, వాసు ఆలయం ప్రాంతంలోని ప్రధాన రహదారుల్లో పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, మేతర అజయ్ బాబు,ఉపాధ్యాయులు ముస్తాఫా ఆలీ తదితరులు పాల్గొన్నారు.

టీషర్ట్సు, టోపీలు, మొక్కల పంపిణీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాయిస్ యువర్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు, స్థానికులకు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే విధంగా టీషర్ట్సు, టోపీలు, మొక్కలను పంపిణీ చేశారు. నేల, నీరు, వాయు కాలుష్య నివారణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పాత బస్టాండ్ సెంటర్, ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట, ఫైర్ స్టేషన్ సెంటర్లలో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఊటుకూరి కిరణ్, వంశీ, వినీష్, గోపీ కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.



పవరుపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

తహసీల్దార్ సుందర్‌సింగ్‌కు సత్కారం

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా పనిచేస్తూ జీలుగుమిల్లికి బదిలీ అయిన జి.సుందర్‌సింగ్‌ను స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పలు గ్రామాల ప్రజలు బుధవారం ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ పలు గ్రామాల్లో తిష్టవేసిన భూ సమస్యలను సుందర్‌సింగ్ పరిష్కరించారని అన్నారు. తిరుమలంపాలెంలో 41 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సత్వరమే పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బందితో పాటు ఉప్పే ధనుంజయరావు, గుడెల్లి వెంకట్రావు, బంటుమిల్లి బాలకృష్ణ, నిట్టా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



తహసీల్దార్ సుందర్‌సింగ్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, ప్రజలు

రామాయణం, మహాభారతంపై క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ద్వారకాతిరుమల : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులకు రామాయణం, మహాభారతంలోని సారాంశాన్ని తెలియజేశారు. అనంతరం క్విజ్ పోటీలను నిర్వహించారు. మన దేశంలో ఇతిహాసాలు, వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రాచీన భారత దేశ చరిత్ర సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసి, వాటి గొప్పతనాన్ని వివరించారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ



పోతునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని పోతునూరులో, గోపన్నపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారులు, సిబ్బంది మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. నెలాఖరు వరకు మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనారోగ్య పరిస్థితులు, లక్షణాలు గమనించిన వెంటనే సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు.

నూకాలమ్మ సన్నిధిలో ‘అనన్య’ టీమ్



అప్పారావుకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలో సినిమా షూటింగ్ జరుపుకుంటున్న అనన్య చిత్ర యూనిట్ నూకాలమ్మ ఆలయాన్ని దర్శించారు. అలాగే జబర్దస్త్ ఫేం అప్పారావు, లెక్చరర్ మర్రి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అప్పారావుకు వేద ఆశీర్వచనం అందజేసి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

సేవా సంస్థకు కూలర్ వితరణ

అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ, పిల్లల ఆశ్రమానికి నూకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ కూలర్ అందజేశారు. ఆశ్ర నిర్వాహకులు రోజారమణికి ఈ కూలర్ అందించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- 8న జెడ్పీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం మహోత్సవం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఎమ్మెల్యే కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. జగనన్న సంక్షేమ పాలనపై నాయకులు, కార్యకర్తలు సమన్వయంలో విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం రాత్రి దెందులూరు క్యాంపు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎంపికై, ఈనెల 8న ప్రమాణస్వీకారం చేయనున్న గంటా పద్మశ్రీ ప్రసాద్‌ను నాయకులకు, కార్యకర్తలకు పరిచయం చేశారు. నియోజకవర్గంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, వార్డు మెంబర్లు, అన్ని విభాగాల వైఎస్సార్ సీపీ శ్రేణులు, వలంటీర్లు, గృహసారథులు, మండల కన్వీనర్లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా గంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ కుటుంబ సభ్యులందరికీ తాను రుణపడి ఉంటానన్నారు. అందరి సహాయ సహకారాలతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. బహిరంగ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, పి. విజయ్‌బాబు, సరస్వతి కొండలరావు, ఎంపీపీలు బొమ్మనబోయిన సుమలత, తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, సొసైటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, వార్డు మెంబర్లు, పార్టీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఆక్వా చెరువుల తవ్వకాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అనేక చోట్ల పొలాల్లో అనుమతుల్లేకుండా రొయ్యలు, చేపల చెరువులు తవ్వుతున్నారని తెలిపారు. దీనిపై ప్రజలు ప్రజా దర్బారులో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. మండవల్లి మండలం కానుకొల్లు దళిత పేట కాలనీని ఆనుకుని ఉన్న పొలాలను ఆక్వా చెరువులుగా మార్చడంతో తాగునీటి బావులు పాడై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పొలాల మీదుగా గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ ఉందని, అది పగిలితే గ్యాస్ లీకై పెను ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కలిదిండి మండలం ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలో తాగునీటి చెరువులను ఆనుకుని చేపల చెరువులు తవ్వుతుండడంతో తాగునీటి చెరువులు పూర్తిగా కాలుష్యం బారిన పడి ప్రజలు రోగాలపాలవుతున్నారని వివరించారు.

నిడమర్రు ఎంపీడీఓగా విజయకుమారి

నిడమర్రు: నిడమర్రు ఎంపీడీఓగా జి. విజయకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయకుమారి ఇప్పటి వరకు తిరుపతి జిల్లా వరదయ్యపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పని చేసి పదోన్నతి బదిలీపై నిడమర్రు వచ్చారు. నిడమర్రులో పనిచేసిన పీవీవీ ప్రకాష్ ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

అతిసార నియంత్రణపై అవగాహన సదస్సు

పెదపాడు: మండలంలోని వట్లూరులో ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు తల్లిదండ్రులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. నెల 5 నుంచి 17 వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టరు నాగేశ్వరరావు వట్లూరు పీహెచ్‌సీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జింక్, ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్ల ఆవశ్యకతపై తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కే భారతి, ఎంపీహెచ్‌ఈఓ వీవీఎస్‌టీ కృష్ణారావు హెల్త్ సూపర్‌వైజర్ జీ రవికుమార్, ఏఎన్ఎంకే సుశీల, ఎమ్ఎల్‌హెచ్‌పీ సీహెచ్ఓ హరీష్ అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బతో యాచకుడి మృతి

భీమడోలు: స్థానిక సంతమార్కెట్‌లో ఓ యాచకుడు మంగళవారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. మృతుని వయస్సు 55 నుంచి 60ఏళ్ల లోపు ఉంటుందని, కాషాయం దుస్తులు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేడి గాలుల తీవ్రత వల్ల వడదెబ్బ బారిన పడి అతడు మృతి చెందాడని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	24
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	02
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	12
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	29
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు -తిరుపతి	16.00	4830	36